క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 33/11 కేవీ ముస్తాబాద్ చౌరస్తా సబ్‌స్టేషన్, 11కేవీ రాఘవేంద్రనగర్, 11కేవీ గాడిచెర్లపల్లి ఫీడర్‌ల పరిధిలో వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాఘవేంద్రనగర్, కళ్లకుంట కాలనీ, ఇందిరా నగర్, లలితానగర్, వడ్డెరకాలనీ, ఎల్లారెడ్డినగర్, హరీశ్‌రావునగర్, గాడిచెర్లపల్లి, సీతారాం నగర్ కాలనీ, లెక్చరర్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 9నుంచి 11వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'ఆర్యవైశ్య' అధ్యక్షుడిగా శ్రీనివాస్



కొమ్మూరిని కలిసిన శ్రీనివాస్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఎన్నిక నిర్వహించామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు, సంఘం నేతలు లింగం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఉన్నత లక్ష్యాలు



రజనీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఆర్ఎస్ఎస్ చైర్మన్ ఒంటెల సంపత్‌రెడ్డి సూచించారు. ఎస్‌బీఐలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన దేవక్కపల్లె గ్రామానికి చెందిన రావుల రజనీకాంత్‌రెడ్డిని ఆయన ఆదివారం సన్మానించారు. ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ సైతం జాబ్‌మేళా నిర్వహించి పలువురికి ఉద్యోగావకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కనకయ్య, గణేశ్‌రెడ్డి, తిరుపతి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



సన్మానిస్తున్న నేతలు, అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): విధి నిర్వహణలో చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన నారాయణ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నారాయణ దంపతులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీలు, పదవీ విరమణలు సర్వసాధారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాసు, కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, మిరుదొడ్డి, ధర్మారం ఎంపీటీసీలు నర్సింహులు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు ఫహీం, మండల సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవిత చరిత్రను ముద్రించాలి

గజ్వేల్‌రూరల్: మహనీయులైన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని అంబేడ్కర్ భవనం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అట్కూరి రాములు, మస్కూరి కిష్టయ్య కోరారు. అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌ల కృషి ఫలితంగానే అందరికీ చదువు, సమాన హక్కులు కల్పించారన్నారు. వారి త్యాగాలను గుర్తిస్తూ ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, ఎల్లయ్య, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

బెజ్జంకి(సిద్దిపేట): తోటపల్లిలో గ్రామ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన శ్రీనివాస్‌తోపాటు ఎంపీటీసీ నల్లగొండ లక్ష్మీనర్సయ్యను సన్మానించారు. ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి వారిని సేవలను ప్రశంసించారు. మాజీ సర్పంచ్ నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తని ఆశలు



మొలకెత్తని విత్తనం

వరుణుడు కరుణించక పోవడంతో విత్తు మొలకెత్తక రైతు దిగులు పడుతున్నారు. దుక్కులు దున్నిన రైతులు ఇప్పుడు దిక్కులు చూస్తున్నారు. చిగురులు తొడగాల్సిన విత్తనాలను చీమలు తింటుండటంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. ఈ నెలలో అనుకున్నంత స్థాయిలో వానలు కురవలేదు. ఇక సాగు కోసం జూలై నెలలో 15 రోజులే విత్తనాలు చల్లుకునే గడువు ఉంది. ఈ నేపథ్యంలో సరైన వర్షాలు కురవక పోతే పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)

ప్రమాదాలకు పిలుపులు



పొదల్లో పడిఉన్న సూచిక బోర్డు

మూల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. హెచ్చరిక సూచిక బోర్డులు లేకపోవడంతో అదుపుతప్పి వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. దీంతో మరణాలు సంభవించడంతోపాటు గాయాలపాలై ఆస్పత్రుల పాలవుతున్నారు. మరోవైపు మండల పరిధిలో ఉన్న సూచిక బోర్డులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. తుప్పపట్టి పాడైపోయినా వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంలేదు. మరికొన్ని బోర్డులను వాహనాలు ఢీకొట్టడంతో ధ్వంసమై పొదల్లో దర్శనమిస్తున్నాయి.

– మిరుదొడ్డి(దుబ్బాక)

ఆర్టీసీతోనే సురక్షిత ప్రయాణం

గజ్వేల్‌రూరల్: సురక్షితమైన ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమవుతుందని సీఐ సైదా పేర్కొన్నారు. 'లక్ష్మే లక్ష్యం' చాలెంజ్‌లో భాగంగా జీపీపీ డిపోలో ఏప్రిల్, మే నెలల్లో అధిక ఆదాయం తీసుకు వచ్చిన కండక్టర్, డ్రైవర్‌లతోపాటు వ్యాసరచన పోటీల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు శనివారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్లు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీపీపీ డిపో మేనేజర్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఐ, డీఎం సురేఖ తదితరులు

భువనగిరి అభివృద్ధికి కృషి

● ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలసి ఆయన మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం అలుపెరుగని పోరాటం చేయాలని సీఎం ఆదేశించారన్నారు. తమ నియోజకవర్గంలోని 16 మున్సిపాలిటీలలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సిద్దిపేటకు నీరు తరలించి అన్యాయం చేశారని విమర్శించారు. తనకు చిత్తశుద్ధి ఉంటే ఆగస్టు 15న రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సవాలు విసిరారు. జనగామ, కొమురవెల్లికి సంబంధించిన రైల్వే పనులు వెంటనే పూర్తికావడానికి చొరువ చూపుతామని చెప్పారు. ఎయిమ్స్ ఆసుపత్రి పనులు డిసెంబరు నాటికి పూర్తిచేసి నిరుద్యోగులకు ఉపాధి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజులలో ఎంపీ నిధులను మల్లన్న ఆలయానికి కేటాయంచి ఆలయ అభివృద్ధికి తోడ్పడుతామని పేర్కొన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, శ్రీనివాస్, కొమ్మురవి, చేర్యాల మాజీ ఎంపీపీ బుడిగే నర్సింహులు, జంగని రవి, తురాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు అడ్డుకున్న రైతులు

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లి రైతులు మల్లన్న సాగర్ కాలువ పనులు ఆదివారం అడ్డుకున్నారు. కాలువ నిర్మాణం కోసం భూములు అప్పగిస్తే ఎడాది గడిచినా పరిహారం చెల్లించకుండా పనులు చేయడంపై నిర్వాసిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు పనులు అడ్డుకున్నా అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన పాపానికి తమ బతుకులు రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. కొందరికి మాత్రమే పరిహారం చెల్లించి మిగతా వారికి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. పరిహారం చెల్లించాలని అధికారులను డిమాండ్ చేస్తే పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలువ నిర్మాణ సంస్థ ప్రతినిధులు కొండారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణ అక్కడికి చేరుకొని జూలై 15నాటికి పరిహారం చెల్లిస్తామని రైతులకు రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



హామీ పత్రాన్ని చూపుతున్న రైతులు

'రామకోటి'కి భక్తిరత్న జాతీయ పురస్కారం



రామకోటి రామరాజును సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: పాతికేళ్లుగా గజ్వేల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో వేలాది మంది భక్తులచే కోట్లాది రామ నామాలను లిఖింపజేస్తూ ధార్మిక, సేవల్లో కృషి చేస్తున్న రామకోటి రామరాజు భక్తిరత్న జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారతరత్న పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాలలో భాగంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, మహారాష్ట్రలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి తెలుగు వెలుగు భక్తిరత్న మహానంది జాతీయ పురస్కారంతో సత్కరించారు. అందులో భాగంగా రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలను గుర్తించి వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పోలోజు రాజ్‌కుమార్ మహానంది జాతీయ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద కోట్ల నుంచి 400కోట్ల రామనాలను లిఖింపజేస్తూ వెయ్యి కోట్లకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రముఖ యూట్యూబ్ నటుడు సదానందం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలే లక్ష్యం

గజ్వేల్: ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని, భారీ ప్రయోజనం చేకూరనుందని టీపీసీసీ కార్యదర్శి బండారు శ్రీకాంతరావు అన్నారు. జాలిగామలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్‌కు వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా పనిచేస్తే ప్రజలు నమ్మరన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, తామంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తామన్నారు. గజ్వేల్, ములుగు నేతలు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గుప్త, వెంకట్రామ్‌రెడ్డి, భానుప్రకాశ్‌రావు, అనిల్‌రెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలే కవులకు ప్రేరణ



బాలసాహిత్య పురస్కరాలు అందుకున్న కవులు

● ప్రొఫెసర్ సామ సువర్ణాదేవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పురస్కారాలు, సన్మానాలు, ప్రశంసలే కవులకు, రచయితలకు ప్రేరణను కలిగిస్తాయని ప్రొఫెసర్ సామ సువర్ణాదేవి, డాక్టర్ బాలయ్య పేర్కొన్నారు. శ్రీవాణి సాహిత్య పరిషత్ పదో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సిద్దిపేటలో పెందోట బాలసాహిత్య పురాస్కారాలను అందించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులను సన్మానించారు. వివిధ కవులు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం 11మంది కవులకు పెందోట బాలసాహిత్య పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణాదేవి, బాలయ్య మాట్లాడుతూ సాహిత్యం నిరంతరం మానవ అభివృద్ధిని కోరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సాహిత్య పరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, దుర్గయ్య, మల్లారెడ్డి, చంద్రయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ధర్మపురి' మరణం తీరనిలోటు

● కాంగ్రెస్ నేత సతీశ్‌కుమార్



నివాళులర్పిస్తున్న సతీశ్ తదితరులు

సిద్దిపేటకమాన్: మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి తీరనిలోటు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్క సతీశ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ధర్మపురి కీలక భూమిక పోషించారని ప్రశంసించారు. ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ మంత్రులను కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, కృష్ణ, అనిల్, సురేశ్, రాహుల్, రేణుక, రజని, స్రవంతి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

కోహెడ(హుస్నాబాద్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం అమలుపై అభిప్రాయ సేకరణ మహాసభను నిర్వహించారు. ఆదివారం స్థానిక రైతు వేదిక కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎటువంటి భూపరిమితి లేకుండా రైతు బంధు అమలు చేసిందన్నారు. అయిదు ఎకరాలు సాగుచేసిన రైతులకు కూడా రైతు భరోసా అమలు చేయాలని ఎక్కువ మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు చెప్పారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సహకార అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఏఓ భోగేశ్వరస్వామి, యాదగిరి, బాలరాజు, సురేందర్‌రెడ్డి, సుగుణమ్మ, రాజిరెడ్డి, సీఈఓ మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



దుబ్బాకటౌన్: ఆనాటి ఉపాధ్యాయులతో..

అ'పూర్వ' సమ్మేళనం

జిల్లాలో వేర్వేరు చోట్ల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. హుస్నాబాద్ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–1990లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు, దుబ్బాక టౌన్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్, చేర్యాల మండల పరిధిలోని నాగపురి జెడ్పీహెచ్ఎస్‌లో 2003–04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత పాఠశాలల్లో తిరిగి కలుసుకోవడంతో వారంతా ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.



చేర్యాల(సిద్దిపేట): అపూర్వ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **రాజేశ్వర్‌రెడ్డికి పురస్కారం**

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం దక్కింది. తమిళనాడులోని విల్లిపురంలో ఆదివారం జాతీయ హిందూ దేవాలయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక జ్యోతిష్య సంస్థ నిర్వాహకులు మొదటి జ్యోతిష్య సమావేశం నిర్వహించారు. సిద్దిపేటకు చెందిన రాజేశ్వర్‌రెడ్డి జ్యోతిష్యరంగంలో చేసిన సేవలను గుర్తించి జ్యోతిష్య భూషణ బిరుదుతో సత్కరించారు.

◆ **బాధితుడికి 'ఆపన్నహస్తం'**

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్ర బృందం ఆర్థిక సాయం చేసింది. దిలాల్‌పూర్‌కు చెందిన ఫకీర్‌బాబా కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ మిత్ర బృందం సభ్యులు ఆదివారం ఆ గ్రామానికి చేరుకొని ఫకీర్‌బాబా ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. తమ 91వ సేవా కార్యక్రమంలో భాగంగా రూ.20 వేల నగదును అందించి మనోధైర్యం కల్పించారు.

◆ **స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా బాలాచారి**

గజ్వేల్: స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా మూటకోడూరు బాలాచారి ఎన్నికయ్యారు. ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షుడిగా బాలాచారి, ఉపాధ్యక్షుడుగా శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులుచారి, కార్యదర్శిగా శ్రీకాంత్‌చారి, కోశాధికారిగా నర్సింహచారి ఎన్నికయ్యారు.

◆ **జనసేన బలోపేతానికి కృషి**

సిద్దిపేటఅర్బన్: జనసేన పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు మురార్ కార్ సాయికుమార్, శివకుమార్, ధర్మేందర్ తెలిపారు. ఆదివారం అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ రాకతో జిల్లాలో ఊపు వచ్చిందన్నారు. గ్రామల్లో కమిటీలను ఏర్పాటుచేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కనకరాజు, రాజేశ్, కన్నయ్య, ప్రసాద్, భరత్, దినేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఐ శ్రీనివాస్ ఆర్థిక సాయం**

దుబ్బాకరూరల్/దుబ్బాక: అరవై ఏళ్లుగా పోలీస్ స్టేషన్లో స్వీపర్‌గా పనిచేసి ఇటీవల మరణించిన హబ్సిపూర్ గ్రామానికి చెందిన ఎండీ మౌలాబీ (100) కుటుంబ సభ్యులను సీఐ శ్రీనివాస్ ఆదివారం పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **ఇసుక ట్రాక్టర్ల పట్టివేత**

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం గ్రామం కూడవెల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామని, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

◆ **సొంత ఖర్చులతో మరమ్మతులు**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద చెడిపోయిన బోరు మోటార్‌ను మాజీ సర్పంచ్ పుల్లోజి కిరణ్‌కుమార్‌చారి తన సొంత నిధులతో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. రెండు నెలలుగా దేవాలయం వద్ద ఉన్న బోరు మోటార్ చెడిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడడాన్ని ఆయన గమనించి బోరును రిపేరు చేయించారు.

◆ **ఎరుకల సంఘం అధ్యక్షుడిగా రాజేశ్‌కన్నా**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట ఏకలవ్య ఎరుకుల సంఘం అధ్యక్షుడిగా కెమ్మసారం రాజేశ్‌కన్నా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఎన్నికయ్యారని, అలాగే ప్రధాన కార్యదర్శిగా నాగరాజు ఎన్నికైనట్టు నిర్వహణ అధికారి రాజేశ్వర్ తెలిపారు.

◆ **కాంగ్రెస్ నేతకు పరామర్శ**

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండల అధ్యక్షుడు అక్కం స్వామిని ఆదివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్వామిని ఆయన ఘణాపూర్‌లో కలిసి ప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నేతలు తిరుపతి, విజయ్‌రెడ్డి, రాములు, నరేందర్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, లాల్, గణేశ్, నర్సింహులు ఉన్నారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): కరీంగర్ డైరీ బెజ్జంకిశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలిగ సతీశ్, సభ్యులుగా గుబిరె సతీశ్, రవి, రవీందర్, మహేశ్, అరుణ, శ్రీనివాస్, లచ్చయ్య, కిషన్, లక్ష్మణ్ ఎంపికయ్యారు.

◆ **రాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి 18వ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా 2వ తేదీ నుంచి 4వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు ఆదివారం తెలిపారు. భక్తుల కోసం నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.